# భూసారం కోల్పోనివ్వవద్దు

- గడ్డిని కాల్చకుండా భూమిలో దున్నితే ప్రయోజనం
- సూక్ష్మ పోషకాలు నశించడంతో దిగుబడిపై ప్రభావం
- అధునాతన యంత్రాల ద్వారా గడ్డి సేకరించాలి


పెనికేరులో పొలంలో తగులబడుతున్న ఎండుగడ్డి


ఎండుగడ్డి నుంచి వెలువడుతున్న పొగలు

**ఆలమూరు:** ఖరీఫ్, రబీ సీజన్‌లో అనేక మంది రైతులు వరికోత యంత్రాలనే వినియోగిస్తున్నారు. దీనివల్ల ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతుంది. గడ్డికి డిమాండు ఎక్కువగా ఉన్నా కోత యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల వాటి లభ్యత అంతంత మాత్రమే ఉంటుంది. పాడిపశువులు లేని రైతులు పొలాల్లో గడ్డి నలిగిపోవడం వలన పశువులకు పనికిరాదన్న ఉద్దేశంతో ఎండుగడ్డిని పొలాల్లోనే తగలబెడుతున్నారు. దీనివలన భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవయసాయశాఖ చెబుతుంది. ఆ గడ్డిని పొలంలోనే ఉంచి దమ్ముల సమయంలో కలిపిదున్నడం ద్వారా భూమికి మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన స్ట్రాబేలర్ యంత్రాలను వినియోగించి ఎండుగడ్డిని సంరక్షించుకోవాలని సూచిస్తున్నారు. పొలాల్లో నలిగిన గడ్డిని యంత్రం ద్వారా మోపులుగా సేకరించి పశుగ్రాసంగా వినియోగించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డిని సేకరించడం ద్వారా రైతులకు కొద్దిమేర ఆదాయం లభిస్తుంది. వరి కోత యంత్రాల ద్వారా లభ్యమైన గడ్డిని ఏదో విధంగా సద్వినియోగం చేసుకోవాలే తప్ప కాల్చడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యవసాయశాఖ అధికారులు వివరిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో సుమారు 58 వేల ఎకరాల్లో రబీ సీజన్‌కు సంబంధించి వరి సాగు జరిగింది. ఇప్పటికే సుమారు 80 శాతం మేర జిల్లాలోని వివిధ మండలాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇటీవల కాలంలో వరికోత యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల గడ్డి పనికి రాకుండా పోతుందని రైతుల అభిప్రాయంగా ఉంది. కోత కోసినప్పుడు గడ్డి నలిగిపోతుందని, దీంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఇష్టపడవని రైతులు భావిస్తున్నారు. పశుగ్రాస అవసరాలకు ఉపయోగపడదనే ఉద్దేశంతో ఈ గడ్డిని పొలాల్లోనే తగులబెట్టడం పరిపాటిగా మారింది. ఈ గడ్డి తగుల బెట్టినప్పుడు వేడిగాలులతో సమీపంలోని ప్రజలు, రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మంటలు ఒక పొలం మీదుగా మరో పొలానికి వ్యాపిస్తూ ధాన్యపు రాశులతో పాటు పొలాల్లో దిమ్మలపై ఉంచిన గడ్డివాములు నిప్పంటుకుని బూడిదైన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. గడ్డిని తగలబెట్టకుండా దమ్ములో కలిపి దున్నడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. గడ్డిని కాల్చకుండా దున్నడ ద్వారా కలిగే ప్రయోజనాలు, చేలకు సంభవించే భూసారం వివరాలను రైతులకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే వ్యవసాయశాఖ సదస్సులను ఏర్పాటు చేస్తుంది.

### దున్నితే భూసారానికి మేలు



పొలాల్లో గడ్డిని తగులబెట్టడం చాలా పెద్ద పొరబాటని రైతులు తెలుసుకోవాలి. దీని వలన సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గిపోతుంది. పొలాల్లో పడి ఉన్న గడ్డితో కలిపి దమ్ము చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.. పొలంబడి కార్యక్రమాల్లో ఈ విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.లక్ష్మి లావణ్య, ఏవో, ఆలమూరు

### భూసారానికి అపార నష్టం

ఆరోగ్యవంతమైన భూమిలోని ఒక గ్రాము మట్టిలో టెన్ టూ ది పవర్ ఆఫ్ నైన్ (10,000000000) సూక్ష్మజీవులు ఉంటాయి. భూమిలో కుళ్లిన పదార్థాన్ని ఇవి ఆహారంగా తీసుకుని మొక్కలకు అవసరమైన సూక్ష్మ పోషకాలను అందిస్తుంటాయి. పొలాల్లోని గడ్డిని కాల్చివేయడం వలన ఈ సూక్ష్మజీవులు చనిపోయి భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల వలనే గతంలో రైతులు ఎప్పుడు వినియోగించని జింకు, బోరాన్ తదితర చిన్నచిన్న సూక్ష్మ పోషకాలను పొలాల్లో నేరుగా వేయాల్సి వస్తుంది. గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కుళ్లించి నేలలో కలిపి మురుగు దమ్ము చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. ఈ విధంగా చేసేటప్పుడు దమ్ముకు దమ్ముకు మధ్య వారం రోజులు వ్యత్యాసం ఉండాలి. దీనివలన ఈ గడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసిపోయి మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా అందుతాయి.

## క్లుప్తంగా

### శనైశ్చరునికి ప్రత్యేక తైలాభిషేకాలు


మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**కొత్తపేట:** శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈవో నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,38,430, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.47,999తో మొత్తం రూ.1,86,429 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

### ఆదుర్రు బౌద్ధస్తూపం అభివృద్ధికి కృషి


ఆదుర్రు బౌద్ధ స్తూపం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

**మామిడికుదురు:** ఆదుర్రులోని పురాతన ఆది బౌద్ధ స్తూపం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం బౌద్ధ స్తూపాన్ని సందర్శించారు. బౌద్ధ స్తూపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి బౌద్ధ స్తూపం ప్రాధాన్యత, దాని గొప్పదనాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణకు వివరించారు. బౌద్ధ స్తూపాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. లూటుకుర్రు గ్రామ పరిధిలోని భూతాలచెరువు రోడ్డును అభివృద్ధి చేయాలంటూ స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, కూటమి నేతలు ఉన్నారు.

### అదృశ్యమైన వ్యక్తి మృతి

**అయినవిల్లి:** గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఈ నెల 26న అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... అయినవిల్లి గ్రామానికి చెందిన కేశనకుర్తి తిరుపతిరావు (40) ఈ నెల 26న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి రాలేదన్నారు. బంధువులు, స్థానికంగా ఆచూకీ తీసిన లభ్యం కాలేదన్నారు. శనివారం యానం గోదావరి నదిలో అతడి మృతదేహం లభ్యమైందన్నారు. దీనిపై మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

### రేపటి నుంచి మండపేటలో ఆధార్ నవీకరణ శిబిరాలు

**కపిలేశ్వరపురం (మండపేట):** 5 నుంచి 8 వరకూ మొదటి విడతగానూ, 12 నుంచి 15 వరకూ రెండో విడతగానూ రెండు విడతలుగా మండపేట పట్టణంలో ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు బాలఆధార్ నమోదు, 5 –15 వయస్సు గల బాలబాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియను శిబిరాల్లో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ నవీకరణ చేస్తారన్నారు. 5 నుంచి 8 వరకూ తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల మూడో సచివాలయంలోనూ, సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోనూ నవీకరణ సేవలందిస్తారన్నారు. 12 నుంచి 15 వరకూ తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక గల రెండో సచివాలయంలోనూ, గొల్లలగుంటలోని ఒకటో సచివాలయంలోనూ నవీకరణ సేవలందిస్తారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

### బీసీ హాస్టల్ భవనంలోకి పీహెచ్‌సీ తరలింపు

**రాయవరం:** రాయవరం పీహెచ్‌సీని బీసీ హాస్టల్ భవనంలోకి శనివారం తరలించారు. బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. శిథిలస్థితిలో ఉన్న పీహెచ్‌సీని సురక్షిత ప్రదేశానికి తరలించాలన్న డిమాండ్ నేపథ్యంలో బీసీ హాస్టల్ భవనంలోకి మార్చారు. సురక్షిత ప్రదేశంలోకి మార్చిన పీహెచ్‌సీలో ప్రజలు వైద్య సేవలు పొందాలని ఎమ్మెల్యే జోగేశ్వరరావు సూచించారు. అలాగే 129 మహిళలకు స్వయం ఉపాధి పథకంలో భాగంగా కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే జోగేశ్వరరావు ప్రారంభించారు. అలాగే రాయవరంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు.

## కిటకిటలాడిన వేంకటేశ్వరుని ఆలయాలు

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో మండలంలోని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు**

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన


పెనికేరులో సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**ఆలమూరు:** అశ్రద్ధ వహిస్తే ప్రాణాంతకంగా రూపాంతరం చెందే సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలను వైద్యారోగ్య సిబ్బంది శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, కె.శ్రీకాంత్ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది వలస కార్మికులకు ఈ పరీక్షలు నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశ పారంపర్యంగా సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలో మారి రక్తనాళాలలో ప్రయాణం చేయలేక శరీరంలో నొప్పులు ఎక్కువ అవుతాయని వివరించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా అక్కుల, బి.సూర్యనారాయణ, సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు


పోస్టర్ విడుదల చేస్తున్న ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు

**మామిడికుదురు:** రాష్ట్రోపాధ్యాయ సంఘం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మనం చదువుకున్న బడి–మన ఊరి బడి–ప్రభుత్వ బడి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద శనివారం ఆవిష్కరించారు. ఎస్టీయూ మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారని, పిల్లలపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చదువుకునే స్వేచ్ఛ ఉందని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మాత్రమే ఎన్నో సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ఒంటితాడిలో ధాన్యం రాశులపై నిలబడి నిరసన తెలియజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

**కాజులూరు:** రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును ప్రభుత్వం వేగవంతం చేయాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శనివారం మండలంలోని కాజులూరు, చేదువాడ, ఒంటితాడి, శీల తదితర గ్రామాల్లో రాజబాబు తదితర రైతు సంఘాల నాయకులు పర్యటించి రైతులను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1725 ప్రకటించినప్పటికీ రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో మిల్లర్లు దళారుల ద్వారా రూ.1550కే కొనుగోలు చేస్తున్నారన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోక రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతుంటే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరగక తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుందన్నారు. దీంతో నికర ఆదాయం తగ్గి అప్పులపాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో కాటా, జట్టును ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ప్రోత్సహించి రైతులు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం నాయకులు దండంగి సమర్పణరావు, బిల్లా సూరిబాబు, అంగడి ఈశ్వర్రావు, దండంగి సత్యనారాయణ, దంగేటి అప్పారావు, ఎస్ మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


పాశర్లపూడిలంకలో నిర్వహించిన కిశోరి వికాసం ర్యాలీ


పినపళ్లలో కిశోరి వికాసం-2 అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**మామిడికుదురు:** బాలికల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమం పాశర్లపూడిలంకలో శనివారం జరిగింది. దీనిలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బాలికలకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. బాలికలు సరైన పోషకాహారం తీసుకోని పక్షంలో శారీరకపరంగా పలు సమస్యలు ఎదుర్కొంటారని చెప్పారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని వాటిని ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెరుకూరి పార్వతి, చెరుకూరి సత్తిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

**పినపళ్లలో..**

**ఆలమూరు:** మండలంలోని పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లో శనివారం కిశోరి వికాసం–2పై కౌమార దశ బాలికలకు అవగాహన సదస్సు జరిగింది. ఆయా గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌లు సంగిత సుభాష్, తోట భవాని నేతృత్వంలో గ్రామ సచివాలయ, అంగన్‌వాడీ ఆశ సిబ్బంది పాల్గొని 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల అక్రమ రవాణా గురించి వారు వివరించారు. రుతుక్రమంలో సంభవించే పలు రుగ్మతల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలికల ఒకరినొకరు పరిచయం చేసుకుని ఉల్లాసంగా గడిపారు. గ్రామ కార్యదర్శులు ఎస్.వీర్రాజు, కె.లోవరాజు. ఏఎన్ఎంలు కె.విజయలక్ష్మి, కె.వెంకాయమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఆర్.నాగేశ్వరరావు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువకుల కుటుంబానికి పరామర్శ


అంబాజీపేటలో స్వామి నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

**అంబాజీపేట:** సింహాచలం సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో మృతి చెందిన అంబాజీపేట కొర్లపాటి వారిపాలేనికి చెందిన పత్తి దుర్గా స్వామి నాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషరావు కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శనివారం పరామర్శించారు. ఆ యువకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పత్తి దత్తుడు, కుంపట్ల శ్రీనివాసరావులకు మనోధైర్యం కల్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పీకే రావు, కొర్లపాటి కోటబాబు, సూదాబత్తుల రాము, శీలం మోహనరావు, అద్దగళ్ల వెంకట సాయిరామ్, చప్పిడి రామకృష్ణ పరామర్శించిన వారిలో ఉన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి


మామిడికుదురు ఎస్టీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వరప్రసాద్

**మామిడికుదురు:** డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలంటూ మామిడికుదురు గ్రామస్తులు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు విన్నవించారు. ఎమ్మెల్యే శనివారం మామిడికుదురులో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఎస్టీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, తమ కాలనీని మెరక చేయించాలని అభ్యర్ధించారు. శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలకు గురైందని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ కల్యాణ మండపం నిరుపయోగంగా మారిందని స్థలదాత కుటుంబ సభ్యుడు యాలి శ్రీనివాస్ తెలిపారు. కల్యాణ మండపానికి సీలింగ్ వేయించి దాన్ని బాగు చేయించాలని కోరారు. బస్టాండ్ ఆక్రమణలకు గురైందని దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గెద్దాడలో కూడా పర్యటించారు. ఆయన వెంట కూటమి నేతలు ఉన్నారు.

## ఆధునిక వైద్య పద్ధతులపై అవగాహన


మండపేటలో పీఎంపీలతో మాట్లాడుతున్న వైద్యుడు

**కపిలేశ్వరపురం (మండపేట):** ఆధునికంగా ఉనికిలోకి వస్తున్న వైద్య పద్ధతులపై ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్‌కు అవగాహన అవసరమని పలువురు వైద్యులన్నారు. మండపేట టౌన్ హాల్‌లో శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన తరగతిని నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జీవీఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రామ్ గోపాల్‌తేజ, న్యూరోసర్జన్ డాక్టర్ అద్దేపల్లి శ్యామ్‌సుందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాణిక్యాంబలు వారి వారి వైద్య విభాగాలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ నాయకులు మట్టా వీరబాబు, బీవీ రమణ, ఇరవాడ రవికుమార్, వీకే రాజు, బళ్ళా శ్రీనివాస్, కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

### సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి

**ఆలమూరు:** మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలను వేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో ఆలమూరు–2, పెనికేరు, పెదపళ్ల, కలవచర్ల, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం, గుమ్మిలేరు గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి అని వైద్యాధికారులు అన్నారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లు అందజేశారు.

### పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

**అయినవిల్లి:** గ్రామాల్లో పారిశుధ్యంపై డీఎల్‌పీఓ బొజ్జిరాజు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జి.భీమారావు ఆధ్వర్యంలో డీఎల్‌పీఓ బొజ్జిరాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పేరుకుపోయిన తడి, పొడి చెత్తను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వారానికి ఒక రోజు శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా కాపాడాలన్నారు.

### సత్తెమ్మ ఆలయ దశమ వార్షికోత్సవం

**రాయవరం:** రాయవరంలో మల్లేశ్వరపు వంశీకుల సత్తెమ్మతల్లి ఆలయ దశమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఘనంగా అన్న సమారాధన చేపట్టారు. రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### పుష్కరాలను ఘనంగా నిర్వహించుకుందాం

**రామచంద్రపురం:** 2027లో రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా క్షేమంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు, అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో శనివారం 2027లో గోదావరి పుష్కరాలకు సంబంధించి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఉన్న పుష్కర ఘాట్లలో మరమ్మతులు, వసతుల కల్పనపై ఆర్డీవో అఖిల అధ్యక్షతన అధికారులతో సమీక్షించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా, క్షేమంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పుష్కర ఘాట్లలో ఏర్పాటు చేయాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో పుష్కర ఘాట్లను పరిశీలించి తమ శాఖల పరిధిలో కల్పించాల్సిన వసతులపై ఓ అంచనాకు రావాలన్నారు. త్వరలో మరో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో కె.గంగవరం మండలంలో 14, కపిలేశ్వరపురం మండలంలో 8 పుష్కర ఘాట్లు ఉన్నాయన్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ ప్రజలు పుష్కర పుణ్యస్నానాల కోసం ఇతర జిల్లాలకు వెళ్లకుండా ఇక్కడే అవసరమైన వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరూ వారి పరిధిలోని పుష్కర ఘాట్లకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కల్పించాల్సిన వసతులు, ఏర్పాట్లపై అంచనాలు తయారు చేయాలన్నారు. అంచనాలు త్వరగా తయారు చేసి ఆర్డీవో కార్యాలయానికి సమర్పిస్తే వాటిని క్రోడీకరించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.